**రూపవాణి ఫిలిం రివ్యూ**

### నేటి గాఢాంధకార తెలుగు చలనచిత్ర లోకంలో

## వెలుగును చూపించే ఉత్తమ సాంఘిక చిత్రం

# స్వతంత్రావారి 'ద్రోహి'

- ♦ ప్రసాద్ దర్శకత్వము, నటన చాలా బాగున్నవి.
- ♦♦ పాములేని కొరతను శివరావు తీర్చాడు.
- ♦♦♦ లక్ష్మీరాజ్యం ఆడగాంధిగా రాణించింది.

పాములూ తేళ్లూ, గాడిదలూ, గుఱ్ఱాలూ, దొంగలూ, దేవతలూ యిత్యాది సామగ్రితో జానపద చిత్రాలు తీసి, వాటియొక్క ప్రయోజనాన్ని గురించి తాము నమ్మలేక ప్రేక్షకుల్ని నమ్మించలేక గుడ్డెద్దు చేలో పడ్డట్లు దాట్లువేసే మన నేటి నిర్మాతలకు స్వతంత్రావారి "ద్రోహి" చిత్రం ఒక ఛాలెంజి. సాంఘిక వ్యవస్థలోనూ, ప్రజాసౌఖ్యములోనూ, ప్రజాశాంతిలోనూ అభ్యున్నతి రావాలని ఆకాంక్షిస్తూ, తత్ప్రయోజన సిద్ధికోసం వుపయోగపడే సాంఘిక చిత్రాలు, అభ్యుదయ పంథాలో కావాలి, కావాలి అని ఆశగా నిరీక్షిస్తున్న ప్రేక్షకలోకానికి యిది నిజంగా సంతృప్తిని కల్గించే చిత్రమే.

కొద్ది లోపాలు అక్కడక్కడ తొంగిచూస్తున్నప్పటికీ యుద్ధానంతరం తయారుగాబడిన చిత్రములన్నింటికంటె "ద్రోహి" వుత్తమచిత్రమని చెప్పవచ్చు.

ముఖ్యంగా కథావస్తువు ప్రశంసనీయమైనది. అనాది నుంచీ పీడిస్తున్న ఒక సమస్య—ధనమదాంధులకూ దీన జనులకూ మధ్య సంఘర్షణ—ధన పిశాచానికీ—పేదతనముకూ గల సంబంధము—నిరుపేదలు ధన మదోన్మత్తుల బలిపీఠంపై తడిగుడ్డలతో బలిగావింపబడే విధానము...

అసంఖ్యాకులైన సాధారణ ప్రజానీకమును వేళ్లతో లెక్కింపదగిన కొందరు ధనికులు సాంఘికముగా—ఆర్థికముగా—నైతికముగా కొల్లగొట్టే రహస్య పంథా... ... "పాలు నేయీ కొందరికిచ్చి...

ఇదే గొప్ప సమస్య—అత్యంత పురాతన సమస్య—దీనినే నిర్మాతలు ఆధునిక రంగులతో, నవ్యకళా కవళికలతో సూటిగా గుండెకు నాటేలాగు, చిత్రించారు.

దీనిలో పాత్రలన్నీ కూడా మనం నిత్యజీవితంలో చూస్తూ విస్తుబోయేవేగాని ఊహాప్రపంచంలో దాగుడుమూతలాడేవిగాని, దేవలోకంలోని సందేహాస్పదమైనవిగాని కావు.

అందుచాతనే మనకళ్లముందు జరిగే వాస్తవిక సన్నివేశాలు, సంఘటనలూ చూస్తున్నట్లుంది—నటనగా యెంతమాత్రమూ లేదు.

**డైరక్షను:—**

ప్రసాద్ డైరక్టు చేసిన 'గృహప్రవేశం' చూచినతర్వాత, "ద్రోహి"చిత్రాన్ని గురించి యేమీ ఆశించలేక పోయాము. కాని—"ద్రోహి" చిత్రంతో ప్రసాద్ మనపై ఒక గొప్ప "సర్‌ప్రైజ్" విసిరాడని చెప్పితీరాలి. ప్రారంభంనుంచీ, ఆఖరువరకూ ప్రతి సన్నివేశంలోనూ దర్శక ప్రతిభయొక్క కిరణాలు ప్రసారితమైనవి.

"కొక్కరోకో" యని కోడి కూతతో గూడెము యొక్క వాతావరణాన్ని ఒక్కశబ్ద విశేషంతో సూచిస్తూ సచిత్రంగా గూడెమును వర్ణిస్తున్నట్లుగా ప్రతి చిన్న అంశాన్ని గూడ కళ్ళకు గట్టగలిగాడు.

మొత్తంమీద ప్రతి "పాటు" కూడ దానియొక్క



(a)

ప్రత్యేకత, విలువ, సంభాషణల విలువనుబట్టి "ఎఫెక్టివ్" గా వుండేలాగు తీయబడింది.

కొన్ని పాటల సందర్భంలో వేయబడిన ఇన్‌సర్ట్స్ చాలా హృదయంగమంగానూ, ఆకర్షణీయంగానూ వున్నవి. ఈ చిత్రంలో "సజెస్టివ్ ఆర్ట్"ను ఆయాపాత్రల స్వభావానికి అనుగుణ్యంగా వాడారు. ఉదా॥ రాజా, సరోజను అదో వుద్దేశంతో వెంటాడే సమయాల్లో కొంగనోట్లో చేపవుండే ప్రతిమ నొకదాన్ని చూపి, రాజా ఆశ నిరాశ అయినవెంటనే కొంగనోట్లో చేప తీసివేయబడడము, జమీందారు గంగాధరాన్ని అతని దుర్మార్గ ప్రవర్తన యొక్క "క్లయిమాక్స్" చూపే సమయంలో చేతికర్ర పిడిపై చిత్రించబడిన క్రూరజంతువు తలను చూపడము యిత్యాదులు పాత్రల స్వభావ సూచనకు బాగా వుపయోగించినవి.

గూడెములోనుంచి అమాంతంగా ఒక ధనిక గృహంలోనికి విధిచే విసరివేయబడిన సీత మనస్తత్వాన్ని చూపడానికి దర్శకుడు పడిన శ్రమ ఫలించింది. ప్రతిపాత్రయొక్క ప్రవేశ నిష్క్రమణాదులలో "డ్రమెటిక్ ఎఫెక్టు"పై ప్రత్యేక శ్రద్ధతీసుకోబడింది.

గూడెము తగులబడి పోయే సమయంలో గూడెములోని వ్యక్తులకూ, పశుష్యాదులకూ, ఎదురైన మహోపద్రవము వారి సంక్షోభను ఆపత్సమయములో వారిలోని ఐకమత్యము, పరస్పర ప్రేమ, సంరక్షణా సక్తినీ ప్రసాద్ అద్భుతంగా చిత్రించి ఒక వర్గంయొక్క సద్గుణాలను ఎత్తిచూపి మరొకవర్గము యొక్క కఱకు హృదయాన్ని తాతికండ్లను కసాయి మనసును వ్యక్తంచేసి ప్రపంచ జీవితములోని సహజత్వాన్ని అద్దములోవలె చూపించగలగడము ఆయన దర్శక ప్రతిభకు చిహ్నము.

ప్రతి చిన్నపాత్రనుకూడ మొత్తంమీద ప్రత్యేక శ్రద్ధతో, ఉచితమైన స్థానమిచ్చి పోషించడంవల్ల కథాగమనానికి, పరుగుకూ సహాయబడినది.

సీత, తన తాతను వెంటబెట్టుకుని అడుక్కునేందుకు బయలుదేరుతుంది. డోలక్ మెడలో వేసుకుని తాత వాయిస్తూంటే సీత నాట్యంచేస్తూ ముష్టి యెత్తుకునే సీను అనవసరంగా సాగదీశారు. పైగా కొన్ని సమయాల్లో లక్ష్మి రాజ్యం జనంపై Blitz చేసి, చేతి బాంబులు ప్రయోగించి అమాంతంగా పరుస్లుకొట్టే ఆడ రబ్బాకార్లాగ కన్పించింది. మన తెలుగు జీవితంలో, తెలుగునాట యెక్కడా సీతవంటి, నక్లీ స్నేహప్రభను, గాని డోలక్ ఎకాంపెనీమెంటునుగాని, పునర్మిలన్ నాట్యదృశ్యాలనుగాని మచ్చుకు చూడము. అదే ఒక ప్రాంతానికీ, మరొక ప్రాంతానికీ వున్న వ్యత్యాసం. ఈ సీనులో పాత్రలు తెలుగులో మొర పెడ్తున్నప్పటికీ, "మీరు మాట్లాడేది తెలుగుకాదు, బొంబాయి హిందీ చిత్రాలలోని ఎంగిలి ముక్కలు, మీరు ఆడేది హిందీ ఫిల్ముల్లోని అనుకరణ" అంటూ ప్రేక్షకుల అంతర్వాణి నొక్కి వక్కాణిస్తుంది. ఇది దర్శకునికి జీవితగమనిక తక్కువని నిరూపించడానికి తార్కాణం.

బోటు షికార్లూ, (డ్యూయెట్‌తో సహా) నాయికానాయకులు చేతులు చేతులు కలిపి "చెమ్మా చక్కా" పంథాలో పాటలు, నాయిక విరహవేదనను పూల ఉయ్యాలలో వూగుతూ ఘోష పెట్టడమూ, యివి బూజు దృశ్యాలు! బూజు భావాలు!! యిందులో స్వతంత్ర భావము యేకోశానా లేదు.

నాయికా నాయకుల పెండ్లిని కొత్త పద్ధతిలో చక్కగా ప్రక్క సంగీత సహాయముతోనే పెళ్ళి సీనులకోసం కొంత పుటేజిని దండగ పెట్టకుండా సూచించడం చమత్కృతి.

సీత నిర్దోషి అని డైరక్టుగా తేల్చకుండా మాంఛి సస్పెన్సుతో నడపడం నిజంగా తెలివితేటలే.

## సంగీతము:—

సంగీతములో నూతనత్వము మచ్చుకయినా కనబడదు. ప్రతిట్యూను యిదివరకు ఎక్కడో విన్న పాతవాసనే గొడ్తుంది. పైగా పాత్రకు, సన్నివేశానికి, వాతావరణానికి అనుకూలమై, రససిద్ధికి తోడ్పడవలసిన సంగీతం కరువయిపోయింది. వీధులలో అడుక్కుతినే సీత యింగ్లీషు ట్యూనులలో గీపెడ్తూ కుప్పిగంతులు వేస్తుందంటే చాలా జుగుప్సాకరమయిన విషయం. పాత్ర తెలుగుది, వేషధారణ హిందూస్థానీ బిచ్చగత్తెవలె, పాట యింగ్లీషుబాణీ. పునర్మిలన్‌లోని స్నేహప్రభ నృత్యసన్నివేశంలాగ ఎఫెక్టు తేవాలని తిప్పలు—ఘోరంగావుంది అనుకరణ. తెలుగు



(౬)



ఉత్తమనటనతో చిత్రానికి వన్నె దెచ్చిన ప్రసాద్ & లక్ష్మీరాజ్యం.

బిచ్చగత్తెలు మన ప్రాత పాటలయినా పాడ్తారు. లేక పాప్యులరు హిందీపాటలు (రత్తన్ వగైరా ఫిల్ములలోనివి) తప్పులతో పాడ్తారుగాని—యీ కవిత్వంతో, యీ బాణీలో పాడరు. సంగీతం ఆ పాత్రయొక్క రససిద్ధికి తోడ్పడవలె గాని విదేశీ ట్యూనులతో "హారాకిరి" చేయించడం మ్యూజిక్ డైరక్టరుకు చెడుపేరునే తెస్తుంది.

"పార్టీ"లో సరోజ పాడిన (కాఫీ) గజల్ కూడ అంతే. కులాసాగా నలుగురూ చేరినసమయంలో సరోజ కూర్చొని పాడిన పాట వింటూంటే ఆ పాత్రయొక్క హుందాతనము, అదృశ్యమైపోయి యే బొంబాయి రెడ్ లైట్ డిస్ట్రిక్టులోనో రసికులను ఆనందపరచడానికి ఒక చౌకబారు వ్యభిచారిణి పాడే పద్ధతిగా వుంది. పాట బాగానే పాడించారు గాని ఆ సమయంలో, ఆ పాత్ర ప్రత్యేకించి పాడడం పాత్ర గౌరవాన్ని ఖూనీచేసింది.

రాముడినోట వచ్చిన "బుల్ బుల్" పాట ఆ పాత్రకు యెంతైనా తోడ్పడి యిటు వినోదాన్నిస్తూ, అటు రాముడి పాత్రయొక్క మనస్తత్వాన్ని చక్కగా విశదీకరించి దర్పణములోవలె ప్రతిబింబింప జేసింది. బోటులో షికారు డ్యూయెట్ వగైరాలు పాతవాసన గొడ్తున్నవి.

"చక్కిలిగింతలు లేవా!" అనేపాట యీ చిత్రమంతటికీ ఆకర్షణీయముగా చేయాలని మ్యూజిక్ డైరక్టరు శ్రమించినట్లు విశదమవుతూంది. కాని ఆ పాటలోని బహు పేలవమైన కవిత్వము ట్యూనులోని మజాను హజామత్ చేసింది. ఫలితం శూన్యం. మొత్తంమీద సంగీతంలో చెప్పుకోదగిన విశేషం యేమీ కనిపించలేదు—జి. వరలక్ష్మివంటి కమ్మని కంఠంగల తార వుండికూడ సరిగా వుపయోగింపబడలేదు.

కథారచన:—

కథ అనవసరంగా పెంచబడింది. చూచినదే మళ్లీ చూస్తున్నట్లు అనిపిస్తుంది. కాంపౌండరు పాత్రలో ఔచిత్యాన్ని చంపి "ఛీప్ హ్యూమరు" కోసం అర్థవిహీనమూ అసహజము, అయిన కొన్ని అసందర్భపు సిట్యుయేషన్లు, సృష్టించి విసుగు పుట్టించాడు కథకుడు. కథలో పాత్రల సంఖ్య జాస్తీగా వుంది. 'విలనీ' కోసం జమీందారు, రాజా సరోజా అనే మూడుపాత్రలు ప్రవేశపెట్టడం వల్ల ముగ్గురు వంటవాళ్లు కలిసి శాకం కాస్తా చెడగొట్టినట్లయింది. మూడు పాత్రలు తమ తమ 'విలనీ' ప్రదర్శించడం కోసం ప్రత్యేక సంఘటనలు చూపవలసి రావడం, దానితో కథ చాంతాడై కూర్చుంది. తక్కువ పాత్రలతో కథను పరిగత్తించడమే కథకునిలోని ప్రతిభను తెలియబరుస్తుంది. సరోజపాత్ర అసాధారణమైంది. శ్రీలోలో నమ్మకముంది—రాజాతో చాలా చనువుగావుండి దేవాలయాల మీది బూతుబొమ్మల పోజులు వేస్తుంది అతనితో. భర్త ప్రేమకోసం అట్టులు



(C)

జూచి నిరాశజెంది విరక్తి జెందుతుంది, అతనిపై యీర్ష్య కూడ పుడ్తుంది-ఆఖరుకు అసూయ ఆమె హృదయాన్ని దహించివేస్తుంది. ఒకప్పుడయంలో భర్తను యెంతగానో వాంఛిస్తుంది—మరోకసారి, రాజాతో లేచిపోయే దానిలా వుంటుంది—యింకొకసారి పిచ్చిదానివలె వుంటుంది-ఆఖరుకు రాజా కలకత్తా లేచి రమ్మని పిల్చినప్పుడు, అంతగా పతిని లెక్కచేయక ఆశలు వదలుకుని, విచ్చలవిడిగా తిరుగుతూ గూడ హఠాత్తుగా పాము పూలమాలగా "డాంమ్మని" మారిపోయినట్లు వేయిమంది అనసూయలు కోటిమంది సావిత్రుల పాతివ్రత్య బలంతోరా జూపై బడి అమెరికన్ నీగ్రోఛాంపియన్ కంటె లక్షరెట్లు బలంతో ఛాతీతో పిడికిటితో బాక్సింగ్ చేస్తుంది...జై ఆంధ్రనారీ లోకానికి జై అపూర్వ సరోజపాత్రకు జై.

**కవిత్వం:—**

ఒక్క పాటకూడ చక్కని మాటలతో ట్యూనులో అతికిపోయేలాగ పొందికగా యిముడ్చబడలేదు. పాటలు పోటి మోత మ్రోగడానికి వెకిలి వెలితిమాటలే కారణం. మాటలు తూల్తున్నట్లుంది గాని బిగువులేదు. సంభాషణలలో, చమత్కారము యెక్కడాలేదు. పాత్రయొక్క ఇమోషన్‌కు, తగిన జీవం తాను మాట్లాడే మాటల్లో స్ఫురించదు. ప్రతి సంభాషణకూడా అప్పుడే 20 లంకణాలుచేసి పథ్యాహారం చెమ్బాతో మ్రింగే రోగి వాలకంగా వున్నది. "చక్కలిగింతలు లేవా"...అనే పాటయేమిటి?...కవియే పాత్రకు తగిన న్యాయంజేయలేదు. కాంపౌండరు సంభాషణలు వింటే (మలేరియా, అరేబియా, ఆస్ట్రేలియా వగైరా) అప్పుడే యితను కిల్పాకు, పిచ్చి ఆస్పత్రినుండి పారిపోయి వచ్చాడా అనిపిస్తుంది. ఇదే హాస్యమనుకోమని రచయిత అనడం అవివేకం. వెట్టి! సంభాషణలు పూర్తిగా దెబ్బతిన్నవని చెప్పకతప్పదు.

**ఫోటోగ్రఫీ:—**

శ్రీధర్ యిప్పటికప్పుడే మంచి ఫోటోగ్రాఫరుగా ప్రఖ్యాతి జెందినవాడు. ఈ చిత్రంలో సయరోచితమగు లైటింగుతో ప్రేక్షకుల కంటికి హాయినిగోల్పే సాఫీఫోటోగ్రఫీతో చిత్రవిజయానికి, కథనడవడికి తన శక్తినంతటిని వినియోగించాడు. ఔట్‌డోర్ ఇండోర్ షాట్లమధ్య యెక్కువ వ్యత్యాసం కనిపించకుండ చక్కటి యూనిఫార్మిటితో తీయడం చిత్రానికి గొప్పహంగు.



**ఎడిటింగు:—**

చిత్రమంతా ఒక పద్ధతిని ఎడిట్ చేయిబడలేదు అక్కడక్కడ విసుగుపుట్టిస్తూ జోగుతూంది. కొన్ని చోట్ల చాలా బాగావుంది.

**సౌండు:—**

శోభనాచల స్టూడియో అంటే సౌండు పరమ దౌర్భాగ్యంగా తోలుబొమ్మలాటలోని గందరగోళంగా వుంటుందని అందరికీ తెలుసు. ఈ చిత్రంలో అది నిజమేనని కొన్ని సంభాషణలసౌండు చెప్తూంది. పాటలు అన్నీ మొత్తంమీద బాగా రికార్డయినవి.

**నటన:—**

నటనలో అగ్రస్థానం వహించినవారు ప్రసాద్, లక్ష్మిరాజ్యం, వరలక్ష్మి. ప్రసాద్ ఒక కారెక్టర్‌ను చాలా చాకచక్యంతో సహజత్వానికి బహు సమీపంలో నటించి ఆ పాత్రను మనం యెన్నటికీ మరచిపోనట్లు చేయగలిగాడు. లక్ష్మిరాజ్యం సీతగా చక్కగా నటించి మరింత ముందుకు వెళ్ళింది సింపతీ, లేనిపాత్రను యథోచితంగా తెలివితేటలతో నటించింది వరలక్ష్మి. శివరావు యీచిత్రంలో పాములేని కొరతనుతీర్చి అంత "అబ్సర్డిటీ"ని మూటగాకట్టి మనపై విసిరిపారేశాడు. ప్రకాశరావు ఫర్వాలేదు. ప్రభాకర్ మంగళసూత్రంలో కంటె బాగా నటించాడు. రాళ్ళబండి పాత్ర అతి గంభీరంగా, ఆకర్షణీయంగా వుంది.

**ఆర్టు:—**

స్టుడియోలో వేశిన జమీందారు భవనమూ, వీధి సెట్టింగు గూడేమూ దానిలోని వివిధ 'డిటైల్సు' చాలా సహజంగా వుండీ పాత్రలనటనకు తోడ్పడినవి. 'ప్రాపర్టీ' అంతా కూడా నీటుగానూ, సింపుల్‌గానూ ఆర్టిస్టిక్‌గావుంది. ఈ చిత్రంలోని ఆర్టు డైరక్షను న్యూథియేటర్సువారి చిత్రాలతో పోటీచేస్తూంది. ఇందుకు శ్రీ టి. వి. ఎస్. శర్మగారు అభినందనీయులు.

ప్రథమచిత్రం అభ్యుదయ పంథాలో నిర్మించి సాంఘిక చిత్రాలంటే క్రొత్త ఆకర్షణ కల్గించిన ప్రొడ్యూసర్ ప్రకాశరావును,దర్శక ప్రతిభనుచాటే చక్కని చిత్రాన్ని అందించిన డైరక్టరు ప్రసాద్‌ను అభినందిస్తు యీ చిత్రం యావదాంధ్ర ఆంధ్రేతరప్రాంతాలలో విజయభేరి మ్రోగిస్తుందనీ ప్రేక్షకలోకం సంతోషంతో తిలకిస్తారని మేము నమ్ముచున్నాము.

రూపవాణి

(d)